క్లుప్తంగా

రేపు 'పేట' మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఈ నెల 31వ తేదీ ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర శనివారం తెలిపారు. కౌన్సిల్ మీటింగ్ హాల్‌లో 65 అంశాలతో అజెండాను కౌన్సిల్ సభ్యుల ఆమోదం కోసం సిద్ధం చేసినట్లు ఆయన తెలిపారు.

మధ్యాహ్నం అత్యవసర సమావేశం

ఈ నెల 31 వ తేదీ మధ్యాహ్నం 12.30 గంటలకు మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం జరుగుతుందని మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర తెలిపారు. కౌన్సిల్ మీటింగ్ హాల్‌లో జరిగే సమావేశంలో 15 అంశాలతో కూడిన అజెండాను కౌన్సిల్ సభ్యుల ఆమోదానికి సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు.

కోటేశ్వరమ్మకు నివాళి



నందిగామ టౌన్: వైఎస్సార్ సీపీ మండల మహిళా కన్వీనర్ గంగూరి కోటేశ్వరమ్మ మృతి బాధాకరమని ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. మండలంలోని తక్కెళ్లపాడు గ్రామంలో శనివారం ఆమె మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఆయనతోపాటు నాయకులు బుల్లెంకయ్య, పలువురు నాయకులు, గ్రామస్తులు సంతాపం తెలిపారు.

మూగజీవిలో అమ్మ ప్రేమ




నందిగామ: శునకం.. విశ్వాసానికి ప్రతిరూపం.. దానిలో దాగి ఉన్న అమ్మ ప్రేమ... మూడు రోజులుగా కన్న బిడ్డలను చూసేందుకు తపిస్తోంది. నందిగామ మండలం ఐతవరం సమీపంలో ఓ శునకం తన పిల్లలను చేరేందుకు ఎంతో ఆరాటపడింది. ఐతవరం వద్ద జాతీయ రహదారిపై వరద ప్రవాహానికి భారీ వాహనాలు నిలిచిపోయాయి. ఇలాంటి పరిస్థితుల్లో జాతీయ రహదారి పక్కనే ఉన్న ఇంటి వద్ద ఓ శునకం పిల్లలను పెట్టింది. వరద సమయంలో అవతల వైపు ఉండిపోయిన ఆ మూగజీవి భారీ వాహనం అటువైపు వెళ్లినప్పుడు దానివెనుక రెండు రోజులుగా వెంట పడుతోంది. కొంతదూరం వెళ్లి వరద ప్రవాహానికి వెళ్లలేక వెనుతిరుగుతోంది. శనివారం ఈ విషయాన్ని అక్కడ విధుల్లో ఉన్న పోలీసులు గమనించారు. వరద ప్రవాహంలో ఉన్న ఆ ఇంట్లోకి వెళ్లి పరిశీలిస్తే అక్కడ రెండు కుక్క పిల్లలు ఉన్నాయి. నీటిలో తడిసి వణుకుతున్న వాటిని తీసుకువచ్చి శుభ్రం చేసి తల్లి కుక్క వద్దకు చేర్చారు.

వైభవంగా సప్త శనివార సేవ



విజయవాడ కల్చరల్: శ్రీ శృంగేరీ పీఠపాలిత శివరామకృష్ణ క్షేత్రంలో సప్త శనివారం కార్యక్రమంలో భాగంగా ఉదయం శృంగేరీ పీఠాధిపతి భారతీ తీర్థ మహాస్వామి, విదుశేఖర భారతీ స్వామి ఆదేశంతో శనివార సేవను వైభవంగా నిర్వహించారు. సర్వాలంకృత భూషితుడైన శ్రీదేవీ భూదేవి సమేతుడైన శ్రీ వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ రకాలైన పూలతో అలంకరించి అనంతరం భక్తులకు దర్శనానికి అనుమతించారు. ఆలయ ప్రాంగణంలోని శ్రవణ సదనంలో లోక కల్యాణార్థం శ్రీ మహావిష్ణువు సహస్రనామ పారాయణం, తులసి అర్చన చేశారు.

పదకవితకు నృత్యాభిషేకం



విజయవాడ కల్చరల్: సాయిషరీన్ నృత్య అకాడమీ ఆధ్వర్యంలో నాట్యాచారిణి మునిపల్లె మహితీ నృత్య పర్యవేక్షణలో సంస్థ 13 వార్షికోత్సవం సందర్భంగా గాంధీనగర్ హనుమంతరామా గ్రంథాలయంలో శనివారం చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. జతిస్వరం, తిల్లానా, మహిషాసుర మర్దని అంశాలను మనోహరంగా ప్రదర్శించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న చీఫ్ ఓఎస్ సౌత్ సెంట్రల్ రైల్వే నాగయ్య మాట్లాడుతూ చిన్నారుల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలన్నారు. కళాకారులు సాంస్కృతిక వారధులని, వారి సేవలను ఉపయోగించుకోవాలన్నారు. సాయిషరీన్ నృత్య అకాడమీ వ్యవస్థాపకురాలు మునిపల్లె మల్లీశ్వరి మాట్లాడుతూ 13 సంవత్సరాలుగా నృత్య అకాడమీని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చిన్నారులు కీర్తన, మౌనిక, విజయసారధి, సమన్విత, మోమిత, గౌరీ, తేజా, కల్యాణ్ తదితరులను నిర్వాహకులు బాలనాట్యకుసుమ పురస్కారాలతో సత్కరించారు.

రైతు సంక్షేమమే లక్ష్యం

- రూ. 27.30 లక్షలతో సొసైటీ అదనపు భవనం
- ప్రారంభించిన నందిగామ ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



సొసైటీ అదనపు భవనాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న నందిగామ ఎమ్మెల్యే జగన్‌మోహనరావు, చిత్రంలో కేడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి, వసంత నాగేశ్వరరావు తదితరులు

నందిగామ టౌన్: రైతు సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు చెప్పారు. మండలంలోని ఐతవరంలో నిర్మించిన ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అదనపు భవనాన్ని కేడీసీసీబీ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి, హోంశాఖ మాజీ మంత్రి వసంత నాగేశ్వరరావుతో కలిసి శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ కేడీసీసీబీ నిధులు రూ. 27.30 లక్షలతో అదనపు భవనాన్ని నిర్మించారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి రైతులకు అండగా ఉంటున్నారని ఆయన చెప్పారు.

వ్యవసాయ రంగ అభివృద్ధికి కృషి

గత ప్రభుత్వాలు వ్యవసాయ రంగాన్ని పూర్తిగా విస్మరిస్తే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుకు వెన్నుదన్నుగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. ప్రజా సంకల్ప పాదయాత్ర, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు వ్యవసాయం పండగ చేసేలా జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని కొనియాడారు. ప్రధానంగా సొసైటీల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి సంఘాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. గతంలో మాదిరిగా కాకుండా బ్యాంకులు, సొసైటీల ద్వారా రైతులకు రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు.

కేడీసీసీబీ సేవలను మరింత చేరువ చేసేలా

కేడీసీసీ బ్యాంకు సేవలను వినియోగదారులకు మరింత చేరువ చేసేలా చర్యలు తీసుకుంటున్నామని బ్యాంక్ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి పేర్కొన్నారు. రైతులు సహకార సంఘాల్లో సభ్యులుగా చేరి సంఘాలు అందించే రుణాలు, రాయితీలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, ఎంపీపీ అరిగెల సుందరమ్మ, చందర్లపాడు జెడ్పీటీసీ సభ్యుడు ముక్కపాటి నరసింహారావు, సర్పంచ్ నాయుడు ఉదయలక్ష్మి, వైస్ ఎంపీపీ అన్నం పిచ్చయ్య, నాయకులు పాములపాటి రమేష్, వైఎస్ఎన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఆదుకుంటుంది.. అధైర్య పడొద్దు..

పొలాలు పరిశీలించిన ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



వరద ముంపునకు గురైన పొలాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: వరదలకు పంట నష్టపోయిన రైతులు అధైర్య పడొద్దని ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహనరావు భరోసా ఇచ్చారు. మండలంలోని అంబారుపేటలో వరద ముంపునకు గురైన పంట పొలాలను శనివారం ఆయన పరిశీలించారు. జగన్‌మోహనరావు మాట్లాడుతూ వర్షాలు, ఎగువ నుంచి భారీగా వరద వచ్చినా ప్రభుత్వం, అధికార యంత్రాంగం పూర్తి స్థాయిలో అప్రమత్తమై సహాయక చర్యలు చేపట్టిందన్నారు. అంబారుపేటలో వరద ముంపునకు గురైన పంట నష్టం వివరాలను నమోదు చేయాలని అధికారులను కోరారు. ఆ వివరాలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి నష్టపరిహారం అందించడానికి కృషి చేయనున్నట్లు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, గరికపాటి భాస్కరం, పీఏసీఎస్ చైర్మన్ పాములపాటి రమేష్, నాయకులు గుడివాడ సాంబశివరావు, చిరుమామిళ్ల చైతన్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిష్పక్షపాతంగా ఓటరు నమోదు



వేములపల్లిలో ఓటరు జాబితాను పరిశీలిస్తున్న బీఎల్వో

వీరులపాడు: ఎన్నికల కమిషన్ నిబంధనలకు అనుగుణంగా బీఎల్వోలు ఓటరు నమోదు ప్రక్రియ నిర్వహించాలని తహసీల్దార్ ఆశయ్య నాయక్ పేర్కొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఆయన బీఎల్వోలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఓటర్ నమోదులో తప్పులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, బీఎల్వోలు పాల్గొన్నారు.

కంచికచర్ల: ఓటరు వెరిఫికేషన్‌కు గ్రామాల్లోని అన్ని రాజకీయ పార్టీ నాయకులు సహకరించాలని తహసీల్దార్ పబ్బారి శంకరబాబు పేర్కొన్నారు. కీసర, గండేపల్లి, వేములపల్లి, కంచికచర్ల, గొట్టుముక్కల, మోగులూరు, పరిటాల తదితర గ్రామాల్లో శనివారం ఓటరు వెరిఫికేషన్ కార్యక్రమాన్ని బీఎల్ఓలు చేపట్టారు. కార్యక్రమంలో బీఎల్ఓలు, పలు రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి సీఎం కృషి

ఎమ్మెల్సీ అరుణకుమార్



లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద గ్రానైట్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ అరుణకుమార్

నందిగామ టౌన్: దేవాలయాల అభివృద్ధికి దేవదాయ శాఖ ద్వారా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ పేర్కొన్నారు. మండలంలోని మాగల్లు గ్రామంలో 108 అడుగుల లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో జరుగుతున్న ఆధునీకరణ పనులను శుక్రవారం రాత్రి ఆయన పరిశీలించారు. తొలుత ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ గతేడాది నిర్వహించిన అష్టలక్ష్మీ పౌండరీక మహా యజ్ఞం కార్యక్రమానికి టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారన్నారు. ఆయన ఆధునీకరణ పనులకు గ్రానైట్‌ను అందజేస్తామని ఇచ్చిన హామీ మేరకు ఆలయ ఆధునీకరణకు అవసరమైన గ్రానైట్‌ను ఇచ్చినట్లు చెప్పారు.

చంద్రబాబు కూల్చారు.. జగన్‌మోహన్‌రెడ్డి కడుతున్నారు..

గత ప్రభుత్వంలో చంద్రబాబు ఆలయాలను కూలగొడితే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం నూతన ఆలయాల నిర్మాణాలకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని అరుణకుమార్ తెలిపారు. ఆదాయం లేని ఆలయాలకు దూపదీప నైవేద్యంలో భాగంగా ఒక్కో ఆలయానికి రూ. ఐదు వేలు అందిస్తున్నట్లు గుర్తు చేశారు. తనతో పాటు ఎమ్మెల్యే జగన్‌మోహనరావు పూర్తి సహకారం అందిస్తారని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు గుడివాడ సాంబశివరావు, వైఎస్ఎన్ ప్రసాద్, రాజశేఖర్, నరేంద్ర, ఆలయ అర్చకుడు అంగర రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్‌లో మానవ హక్కుల ఉల్లంఘనపై చర్యలు తీసుకోండి

జగ్గయ్యపేట అర్బన్: మణిపూర్‌లో హింసాత్మక సంఘటనలకు పాల్పడిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో తుమ్మల ప్రభాకర్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు డాక్టర్ షేక్ ఖాదర్‌బాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ విభాగం నాయకుడు, ఇతర నేతలు మాట్లాడారు. తుమ్మల ప్రభాకర్ మాట్లాడుతూ మన దేశంలో ఒక రాష్ట్రంలో ఇలాంటి పరిస్థితులు ఏర్పడటం దురదృష్టకరమన్నారు. రాష్ట్రపతి, ఆ రాష్ట్ర గవర్నర్ జోక్యం చేసుకొని సెక్యులరిజానికి విఘాతం కల్పిస్తున్న మత శక్తులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

తువ్వకాలువ పరిశీలన

అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): అనిగండ్లపాడు గ్రామ శివారులో తువ్వకాలువకు పడిన గండ్లను వైఎస్సార్ సీపీ నాయకులు ఇరిగేషన్ జేఈ ప్రసన్నలక్ష్మితో కలిసి శనివారం పరిశీలించారు. వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు వూట్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను ఆదేశాల మేరకు గండ్లు పడిన ప్రాంతాలను పరిశీలించి మరమ్మతులు చేయాలని అధికారులను కోరామన్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు పిడికిటి కోటేశ్వరరావు, మండల పరిషత్ కో–ఆప్షన్ సభ్యులు సయ్యద్ జాన్‌మియా, ఆలయ డైరెక్టర్ కోలా రామారావు తదితరులు పాల్గొన్నారు.

రహదారికి గండి.. కంచలకు రాకపోకలు బంద్



కంచల గ్రామానికి వెళ్లే రహదారికి గండి

నందిగామ: మండలంలోని కంచల గ్రామానికి వెళ్లే రహదారికి గండి పడడంతో గత రెండు రోజులుగా ఆ గ్రామానికి ఆ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. మునేరుకు వరద రావడంతో ఆ ప్రవాహానికి శుక్రవారం ఉదయం కంచల గ్రామానికి వెళ్లే రహదారికి గండి పడింది. భారీ స్థాయిలో రోడ్డు తెగిపోవడం, శనివారం కూడా వరద కొనసాగుతున్న నేపథ్యంలో ముందు జాగ్రత్తగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం కంచల ప్రజలు చందర్లపాడు మండలం తుర్లపాడు, ముప్పాళ్ల మీదుగా నందిగామకు రాకపోకలు సాగిస్తున్నారు. వరద కారణంగా పలుచోట్ల విద్యుత్ స్తంభాలు పడిపోయాయి.

భక్తిశ్రద్ధలతో మొహర్రం వేడుకలు



జుజ్జూరులో పీర్లను ఊరేగిస్తున్న ముస్లింలు



ముక్త్యాలలో పీర్ల ఊరేగింపు

వీరులపాడు: మండలంలో మొహర్రం పండుగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో శనివారం నిర్వహించారు. జుజ్జూరు గ్రామంలోని పంజా సెంటర్ వద్ద ముస్లిం మత పెద్దలు మహ్మద్ ప్రవక్త బోధనలతో పాటు పండుగ విశిష్టతను వివరించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన పీర్లను ఘనంగా ఊరేగించారు. కార్యక్రమంలో మసీద్ కమిటీ చైర్మన్ చిన్న మీర్ హుసేన్, షేక్ మౌలాలి, కాలే మస్తాన్ వలి, మత పెద్దలు, పెద్ద సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ముస్లింలు పీర్లను ఊరేగించారు.

జగ్గయ్యపేట: మండలంలోని షేర్‌మహ్మద్‌పేట, ముక్త్యాల, గౌరవరం, బండిపాలెం, గండ్రాయిలో ముస్లింలు మొహర్రంను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. తొలుత డప్పు వాయిద్యాలతో పీర్లను గ్రామంలో ఊరేగించగా కులమతాలకు అతీతంగా ప్రజలు పీర్లకు వారు పోసి పూజలు చేశారు. కార్యక్రమంలో ముస్లింలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలో ముస్లింలు మొహర్రం జరుపుకున్నారు. పట్టణంలోని పలు పీర్ల చావిడిలో పీర్ల ఊరేగింపు శుక్రవారం రాత్రి నిర్వహించారు. స్థానిక పాత కూరగాయల మార్కెట్ వీధిలోని లాల్‌సా పీర్ల పంజాలో సవారి ప్రత్యేక అలంకరణలతో పలువురిని ఆకట్టుకుంది. శివాలయం వీధిలో ఉన్న పీర్ల చావిడి నుంచి సవారీలను ఊరేగించి ప్రార్థనలు చేశారు. అనంతరం యువకులు పీర్ల చావిడి వద్ద ఏర్పాటుచేసిన ప్రత్యేక అగ్నిగుండంలో నడిచి తమ పవిత్రతను చాటుకున్నారు. కార్యక్రమంలో యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నందిగామ: మండలంలోని మాగల్లు గ్రామంలో పీర్ల పండుగ కనుల పండువగా సాగింది. ఇస్లాం కోసం త్యాగాలు చేసిన వారిని కీర్తిస్తూ, ఏటా మొహర్రానికి ముందు మాగల్లు గ్రామంలో పీర్లను ప్రత్యేకంగా పూజించి ఊరేగించడం ఆనవాయితీ. చావిడిలోని పీర్ల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన అనంతరం గ్రామంలోని పలు ప్రధాన వీధుల్లో ఊరేగించారు.

వరద తగ్గుముఖం



అంబారుపేటలో పొలాలు



శనివారం జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలు

కనిపిస్తున్న పొలాలు

నందిగామ: మునేటి వరద ఉధృతి కారణంగా పరివాహక ప్రాంతాల్లో పొలాలు మూడు రోజులుగా చెరువులను తలపించాయి. శనివారం వరద కాస్త తగ్గుముఖం పట్టింది. దీంతో పంట పొలాలు కాస్త కనిపిస్తున్నాయి. అంబారుపేట ప్రాంతంలో ఇప్పటికే నాట్లు పూర్తయిన పంట పొలాలలు వరద కారణంగా మేతకు గురయ్యాయి.

నందిగామ: మునేటి వరద తగ్గుముఖం పట్టింది. 18 సంవత్సరాల తరువాత అదే స్థాయిలో మునేటికి వరద నీరు వచ్చింది. గురువారం సాయంత్రం 1.82 లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు వెళ్లగా శుక్రవారం సాయంత్రం 1.40 క్యూసెక్కుల నీరు దిగువకు వెళ్లింది. శనివారం సాయంత్రానికి 55 వేల క్యూసెక్కుల నీరు దిగువకు వెళుతోందని అధికారులు తెలిపారు. మరో రెండు రోజుల్లో పూర్తిస్థాయిలో నీరు తగ్గుతుందని తెలిపారు.

నందిగామ: మునేటి వరద కారణంగా పట్టణంలోని పాత బస్టాండ్ ప్రాంతంలో అనేక ఇళ్లు జలదిగ్బంధమయ్యాయి. శుక్రవారం ఆ కాలనీలో సుమారు ఆరడుగుల మేర వరద నీరు ప్రవహించింది. అదే కాలనీలో శనివారం వరద నీరు మొత్తం వెళ్లిపోవడంతో సాధారణ పరిస్థితి కనిపించింది. అన్ని ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం తెలిపారు.

పెనుగంచిప్రోలు: ఉగ్రరూపం దాల్చిన మునేరు శుక్రవారం సాయంత్రానికి కొంత శాంతించింది. దీంతో కాజ్‌వేపై రాకపోకలు సిద్ధం చేసేందుకు సర్పంచ్ వేల్పుల పద్మకుమారి ఆధ్వర్యంలో జేసీబీలు ఏర్పాటు చేసి కంప, చెత్త తొలగించటంతో పాటు పంచాయతీ సిబ్బంది బురద లేకుండా ట్యాంకర్ల సాయంతో శుభ్రం చేశారు. శనివారం ఉదయం కూడా కాజ్‌వే చివర ఖానాల మధ్య ఇరుక్కున్న చెత్త, కంప, చెట్ల కొమ్మలు తొలగించి శుభ్రం చేశారు. అనంతరం కాజ్‌వేపై రాకనపోకలు పూర్తిస్థాయిలో పునఃరుద్ధరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్యామ్, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు వేల్పుల రవికుమార్, మండల సమాఖ్య అధ్యక్షురాలు కాకాని పద్మ, తదితరులు పాల్గొన్నారు.

నందిగామ: జాతీయ రహదారిపై రాకపోకలు పూర్తిస్థాయిలో ప్రారంభమయ్యాయి. నందిగామ మండలం ఐతవరం వద్ద 65వ నెంబర్ జాతీయ రహదారిపై వరద ప్రవాహం కారణంగా రాకపోకలు పూర్తిస్థాయిలో నిలిచిపోయిన సంగతి పాఠకులకు విదితమే. ఈ నేపథ్యంలో శుక్రవారం సాయంత్రానికే వరద ఉధృతి తగ్గినా పూర్తిస్థాయిలో రాకపోకలు జరగలేదు. శనివారం జాతీయ రహదారికి మరమ్మతులు నిర్వహించి రోడ్డు శుభ్రం చేసిన తర్వాత రాకపోకలను పూర్తిస్థాయిలో పునరుద్ధరించారు.

దెబ్బతిన్న రోడ్లు, పొలాలు



శ్రీతిరుపతమ్మ ఆలయం వద్ద మిగిలిన సామగ్రిని రక్షించుకుంటున్న వ్యాపారులు



గుమ్మడిదూర్రు నుంచి పొలాలకు వెళ్లే రోడ్డు కొట్టుకుపోవడంతో రైతుల ఇబ్బందులు



వరద ఉధృతికి పడిపోయిన విద్యుత్ స్తంభాలు

పెనుగంచిప్రోలు: మునేరు వరదకు పెనుగంచిప్రోలుతో పాటు అనిగండ్లపాడు, గుమ్మడిదూర్రు, వెల్దుర్తిపాడు గ్రామాల్లో రోడ్లు, పంట పొలాలు ఘోరంగా దెబ్బతిన్నాయి. శనివారం వాతావరణం అనుకూలించి వరద ఉధృతి తగ్గటంతో రైతులు తమ పంట పొలాలను చూసుకునేందుకు బయలు దేరారు. తిరుపతమ్మ ఆలయం వద్ద చిరు వ్యాపారులు వరదకు తమ సామగ్రి, దుకాణాలు కొట్టుకుపోగా మాగిలిన సామగ్రిని రక్షించుకునే పనిలో పడ్డారు.

లింగాల కాజ్‌వేపై రాకపోకలు నిలిపివేత



దెబ్బతిన్న లింగాల కాజ్‌వేను పరిశీలిస్తున్న ఆర్అండ్‌బీ, పోలీసు అధికారులు

వత్సవాయి: చిల్లకల్లు వైరా రహదారిపై లింగాల వద్ద మునేటిపై ఉన్న కాజ్‌వేపై రాకపోకలను నిలిపివేస్తున్నట్లు ఆర్అండ్‌బీ డీఈ పరశురాం తెలిపారు. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కాజ్‌వేపై నుంచి వరదనీరు ఉధృతంగా పారింది. శనివారం వరద తీవ్రత తగ్గడంతో కాజ్‌వే పరిస్థితి ఎలా ఉందో ఆర్అండ్‌బీ డీఈ పరశురాం, నందిగామ డీఎస్పీ జనార్దన్‌నాయుడు సంయుక్తంగా పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాజ్‌వేపై వరద తాకిడికి ప్రమాదకరస్థాయిలో పగిలిపోయి ఉండడాన్ని గమనించారు. రహదారి మొత్తం పెచ్చులు ఊడిపోయింది. కాజ్‌వే కింద ఎటువంటి సపోర్టు లేకుండా మట్టి కుంగడంతో భారీ వాహనాలు వెళ్తే రహదారి ఒక పక్కన విరిగిపోయే ప్రమాదం ఉందన్నారు. ప్రస్తుతం కాజ్‌వేపై ఆర్అండ్‌బీ అధికారులు పనిచేసేవరకు రాకపోకలను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఏపీఎస్, టీఎస్ ఆర్టీసీ వారు నెల రోజుల వరకు డైవర్షన్‌తో కూడిన దారులను ఎంచుకోవాల్సిందిగా సూచించారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ ఏఈ నరేంద్ర, ఎస్ఐ బి.అభిమన్యు పాల్గొన్నారు.

అక్రమ రవాణా బాధితులకు పునరావాసం కల్పించాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మానవ అక్రమ రవాణా, వ్యాపార లైంగిక దోపిడీకి గురైన బాధితులకు కమ్యూనిటీ ఆధారిత పునరావాసాన్ని కల్పించాలని అక్రమ రవాణా బాధితుల రాష్ట్ర వేదిక విముక్తి అధ్యక్ష, కార్యదర్శులు అపూర్వ, పుష్ప ప్రభుత్వాన్ని కోరారు. బాధితులకు ఆర్థిక, సామాజిక సాధికారతను అందించాలన్నారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఏడాది ఐక్యరాజ్య సమితి 'అక్రమ రవాణా బాధితులు అందరినీ కలవండి, ఏ ఒక్కరినీ వదలకండి' అనే నినాదంతో అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని ప్రకటించిందని పేర్కొన్నారు. విముక్తి నాయకులు పాల్గొన్నారు.

గండేపల్లిలో పారిశుద్ధ్యం పెంపునకు చర్యలు

గండేపల్లి(కంచికచర్ల): మండలంలోని గండేపల్లిలో శనివారం పారిశుద్ధ్యం పెంపునకు చర్యలు తీసుకున్నట్లు సర్పంచి బొక్కా రవికుమార్ తెలిపారు. ఇటీవల కుండపోతగా కురిసిన వర్షానికి గ్రామ సమీపంలో చప్టాకు వరదనీరు చేరింది. వరద తగ్గుముఖం పట్టటంతో ఆ ప్రాంతమంతా తీవ్రమైన దుర్వాసన వెదజల్లుతోందని అక్కడ బ్లీచింగ్, సున్నం చల్లించామన్నారు. రోడ్ల వెంట, కాలువల వద్ద బ్లీచింగ్ చల్లించామన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఎం శిరీష, పంచాయతీ కార్యదర్శి సాంబశివరావు, సచివాలయ కార్యదర్శి జిల్లేపల్లి రత్నాకర్, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.